హామీలు నెరవేర్చే వారినే ఆశీర్వదించాలి

- జగనన్న మరోసారి సీఎం కావాలి
- పిలుపునిచ్చిన విప్ ఉదయభాను

గంద్రాయి(జగ్గయ్యపేట): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే నాయకులనే ప్రజలు ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. మండలంలోని గంద్రాయిలో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలనను సులభతరం చేశారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని పేదలకు కనీసం సంక్షేమ పథకాలను కూడా అందించలేదన్నారు. జన్మభూమి కమిటీలు కూడా టీడీపీ నాయకుల స్వార్థం కోసం ఏర్పాటు చేసినవేనని మండిపడ్డారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా అగ్రవర్ణ పేదలకు సైతం సంక్షేమపథకాలను ఇంటిముంగిటనే అందిస్తున్నారని గుర్తుచేశారు. ఎంపీ కేశినేని నాని పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ కేశినేని మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు మోసపూరితమైనవని దుయ్యబట్టారు. తాను టీడీపీలో అనేక ఇబ్బందులు, అవమానాలు అనుభవించానని తెలిపారు. ఎన్నికలలో హామీలిచ్చి విస్మరించిన నాయకులలో చంద్రబాబుకుప్రథమ స్థానం దక్కుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం జగనన్న కాలనీలో కట్టా శ్రీను, కొరివి సైదులు గృహప్రవేశ కార్యక్రమంలో ఉదయభాను, కేశినేని నాని పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 10లక్షలతో గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరీ, గ్రామ కన్వీనర్ కనపర్తి ప్రసాద్, కెడీసీసీబీ మాజీచైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, నాయకులు యలమందరావు, నారసాని రాంబాబు, రాజు, శ్రీనివాసరావు, సైదమ్మ, డీటీ నాగరాజు, జేఈ శ్రీనివాసరావు ల్గొన్నారు.


గంద్రాయిలో సచివాలయ ప్రారంభోత్సవంలో విప్ ఉదయభాను, ఎంపీ కేశినేని నాని, నాయకులు


మల్కాపురంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను, ఎంపీ కేశినేని నాని

మల్కాపురంలో..

గ్రామంలో రూ.కోటితో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రాలను విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అదేవిధంగా రూ.45లక్షలతో చేపట్టిన మల్కాపురం-మల్లారం బీటీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత జగనన్న ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సర్పంచి ఆంబోజి జాను, గ్రామ కన్వీనర్ శివరాం, నాయకులు కొంగర దుర్గారావు, ఆంబోజి రామ్మోహన్, గణపనేని పిచ్చయ్య చౌదరి, కార్యదర్శులు శ్రావణ్, జగ్గయ్య ల్గొన్నారు.

రూ.7.20కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

నవాబుపేట(పెనుగంచిప్రోలు): పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండటం మనందరి అదృష్టమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని నవాబుపేటలో రూ.23.94లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, నవాబుపేట నుంచి జయంతిపురం వరకు రూ.6కోట్లతో నిర్మించిన తారురోడ్డు, రూ.43.66లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.37.80లక్షలతో నిర్మించిన నూతన సొసైటీ భవనం, ఎస్సీకాలనీలో రూ.9లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీ, బీసీకాలనీలో రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును విప్ ఉదయభాను, ఎంపీ కేశినానితో కలిసి ఆదివారం ప్రారంభించారు.

బీసీ కాలనీలో రూ.40లక్షలతో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత కింద నవాబుపేటకు మంజూరైన రూ.1.15కోట్లను డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పాలన అందించడంలో ముఖ్యమంత్రి నూతన ఒరవడి సృష్టించారని కొనియాడారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ పేదల కోసం పనిచేసే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే ధనికుల కోసం పనిచేసే వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు.

కార్యక్రమంలో కెడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, సర్పంచి గొర్రెముచ్చు మేరీ, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామ పార్టీ, అభివృద్ధి కమిటీ చైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, డీసీఎంఎస్ డైరెక్టర్ గింజుపల్లి రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మాతంగి శాంతకుమారి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండల బీసీ సెల్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ప్రహ్లాద్‌గౌడ్, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, గుంటుపల్లి వాసు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ పాల్గొన్నారు.


సచివాలయ భవన ప్రారంభోత్సవంలో విప్ ఉదయభాను, ఎంపీ నాని, పద్మావతి, నాయకులు

క్లుప్తంగా

నేడు జాతీయ నాయకుల విగ్రహాలు ఆవిష్కరణ

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల నేషనల్ హైవే పక్కన గ్రామసచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలను సోమవారం ఆవిష్కరించనున్నారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావ్‌పూలే, బాబూ జగ్జీవన్‌రామ్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), గుడివాడ, నందిగామ, జగ్గయ్యపేట, గన్నవరం ఎమ్మెల్యేలు కొడాలి నాని, మొండితోక జగన్ మోహనరావు, సామినేని ఉదయభాను, వల్లభనేని వంశీమోహన్, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్, మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ మహ్మద్ సిరాజుద్దీన్ పాల్గొంటారన్నారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రవీంద్రనాథ్ కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కంచికచర్ల : రౌడీషీటర్లు మంచినడవడిక కలిగి ఉండాలని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి.చంద్రశేఖర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వత్సవాయి : మండలకేంద్రం వత్సవాయిలో వాసవీమాతా ఆత్మార్పణా దినోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు గోపూజ చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పవిత్ర నదీజలాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముస్లింల రిలే దీక్షలు

జగ్గయ్యపేట: షాదీఖానా పనులను కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లి అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ముస్లింలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ముస్లింల నిరాహారదీక్షలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఫిరోజ్‌ఖాన్, ప్రభుత్వాస్పత్రి కమిటీ సభ్యుడు అక్బర్ ఖాన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ రోడ్డులో ముస్లింలకు కేటాయించిన షాదీఖానా నిర్మిస్తున్న స్థలంపై కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లి పనులు నిలిపివేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పునరాలోచన చేసి షాదీఖానా పనులకు సహకరించాలని కోరారు. దీక్షల్లో నాయకులు హుసేన్, మొహిద్దీన్, ఖాజా, అబ్దుల్ రసూఫ్, సుభానీ, సైదా తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘననివాళి



జగ్గయ్యపేట: గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని జగ్గయ్యపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉదయభాను మాట్లాడుతూ నేటికీ ఘంటసాల పాడిన పాటలు ప్రతిఒక్కరి హృదయాలలో నిలిచి ఉన్నాయన్నారు. ఘంటసాల సేవాసమితి నాయకులు వెంకటేశ్వరరావు, చారుగుండ్ల కొండ, బద్యా నాయక్, కేశవరావు, తుమ్మేపల్లి నరేంద్ర, అబ్బాస్ అలీ, తిరుమలగిరి ఆలయ చైర్మన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠా మహోత్సవం


ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్


రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామ టౌన్: మండలంలోని పల్లగిరిలో వేంచేసియున్న సువర్చలా ఆంజనేయస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం స్వామివారి జీవధ్వజ, శిఖర, పరివార దేవతలు, యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగవాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఆలయ పరిసరాలు జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణలతో మార్మోగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

గ్రామంలో నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద త్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఆలయ పునఃనిర్మాణానికి దేవాదాయశాఖ ద్వారా రూ.26లక్షలు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, సర్పంచి చాగంటి రవికిరణ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, గరికపాటి భాస్కరం, చిరుమామిళ్ల చైతన్యకుమార్, బొల్లినేని శ్రీనివాసరావు, వైఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీరోడ్లు, గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన..

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలోని తుర్లపాడు, చింతలపాడు గ్రామాల్లో రూ.66లక్షలతో చేపడుతున్న సీసీరోడ్లు, గోడౌన్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరమసాని నరసింహారావు, జానీ, వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, వెలగపూడి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నందిగామ టౌన్: అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో వేంచేసియున్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామివారి కల్యాణోత్సవంలో ఆదివారం వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నందిగామ పట్టణానికి చెందిన కాపా రామలక్ష్మమ్మ స్మారక సేవా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలంలోని రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులకు అందిస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోదరులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు లయన్స్ క్లబ్ చేయూత


పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కంచికచర్ల : లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు చేయూత నందిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డిస్ట్రిక్ గవర్నర్ శంకరగుప్తా తెలిపారు. స్థానిక పుల్లగూర ప్రభాకరరావు ఆసుపత్రి ఆవరణలో సోమవారం 100 మంది వరదబాధితులు, పేదలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్ ద్వారా ఒక్కొక్కరికి రూ.1200 విలువగల నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకరగుప్తా మాట్లాడుతూ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో పేదలకు నిత్యం భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ సెక్రటరీ చక్రధర్, డిస్ట్రిక్ ట్రెజరర్ రామారావు, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, వెంకటప్పయ్య, కోనేటి శ్రీనివాసరావు, నన్నపనేని నరసింహారావు, దేవిరెడ్డి శేఖర్, సూదుల సోమశేఖర్, పుల్లగూర బాలాజీ, నన్నపనేని నరసింహారావు, దొడ్డా జయనరసింహారావు, కొండా వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్లకు అవగాహన


ఆటోడ్రైవర్‌లకు అవగాహన కలిగిస్తున్న ఆర్టీవో రవికుమార్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటోడ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని ఆటోస్టాండ్‌లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడమే లక్ష్యంగా, ఓవర్ లోడ్ లేకుండా ప్రయాణాలు సాగించాలని సూచించారు. సిబ్బంది ఆలం, విజయభాస్కర్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం


టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో వారితో ఎమ్మెల్సీ అరుణకుమార్


జుజ్జూరులో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు

- ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్
- 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

జుజ్జూరు(వీరులపాడు): రానున్న ఎన్నికల్లో పెత్తందారులతో తలపడుతున్న నిరుపేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని జుజ్జూరులో 50 కుటుంబాలకు చెందిన 207మంది తెలుగుదేశంపార్టీని వీడి ఎమ్మెల్సీ అరుణకుమార్ సమక్షంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తొమ్మిది, పదివార్డుల సభ్యులు ఉప్పుతోళ్ల శ్రీను, తమ్మిశెట్టి కొండ, తమ్మిశెట్టి పుల్లయ్య, దుర్గానాగేశ్వరమ్మ, కుంచం రాజ్యలక్ష్మీలతోపాటు పార్టీలో చేరిన ప్రతిఒక్కరికి ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా గ్రామంలోని బాబు జగ్జీవన్‌రామ్, జెల్లి ఏసోబు, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామానికి విచ్చేసిన అరుణకుమార్‌పై పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించగా, మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ అరుణకుమార్ గ్రామంలోని ప్రతిఒక్కరిని పలకరిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ దాదాపు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో చేరికలు మరింతగా ఉంటాయన్నారు. రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు. మంచి చేస్తుంటే ఓర్చుకోలేని టీడీపీని మరోసారి ఇంటికి పంపిద్దామని పిలుపునిచ్చారు. రూ.18కోట్లతో కంచికచర్ల-పెద్దాపురం రోడ్డు విస్తరణతోపాటు దశాబ్దాల నాటి జుజ్జూరు మండల కేంద్రం కలను సాకారం చేసిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుకే దక్కిందని కొనియాడారు. అతిత్వరలో జుజ్జూరుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి కూడా వస్తున్నాయని తెలిపారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఆశీర్వదించాలని కోరారు. పీఠాధిపతి నరేంద్ర భూపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు జన్మదిన కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు నువ్వుల విశ్వనాథం, పూలా పుల్లయ్య, షేక్ ఫయాజ్, జయాలుద్దీన్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. 23న అమ్మవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా అన్నదానం నిమిత్తం అవనిగడ్డకు చెందిన విశ్వహిందూ పరిషత్, పాంచజన్య గీతాపారాయణ సంఘం ఆధ్వర్యంలో 10క్వింటాళ్ల బియ్యం అందజేశారు.

పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన నల్లబిరుదు శ్రీనివాసరావు, శారద దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.10,016లు విరాళంగా అందజేశారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన బత్తుల శ్రీధర్‌రెడ్డి అన్నదానానికి రూ.11,121 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ధర్మకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.